
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
మంగళవారం, 17 సెప్టెంబరు 2024





ఖమ్మంలో స్తంభాద్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


ఖమ్మంలో శోభాయాత్ర




గణనాథుడి ఊరేగింపులో ఉత్సాహంగా నృత్యం చేస్తున్న చిన్నారి

వినాయక సెలవిక

ఘనంగా గణనాథుడి నిమజ్జన ఉత్సవాలు

- ఖమ్మంలో కన్నులపండువగా శోభాయాత్ర
- ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- పల్లెల్లో ఉత్సాహంగా సాగిన నిమజ్జనాలు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 16: నవరాత్రులు పూజలందుకున్న గణనాథుడు గంగ ఒడికి చేరాడు. తొమ్మిది రోజులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన ప్రజలు చివరిరోజు సోమవారం సందడిగా ఊరేగింపులు నిర్వహించి 'వినాయకా.. సెలవిక' అంటూ సాగనంపారు. పట్టణాలు, పల్లెల్లో అన్నివర్గాల ప్రజలు సమైక్యంగా గణేష్‌ఉత్సవాలను నిర్వహించారు. ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు, వ్యాన్లలో గణనాథులను ఎక్కించి సందడిగా ఊరేగింపులు నిర్వహించారు. ఖమ్మం నగరంలో స్తంభాద్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. మున్నేరుతో పాటు జిల్లాలో ఆకేరు, పాలేరు, వైరా, కట్టలేరు వంటిఏర్లు, పలు చెరువుల, వాగుల్లో గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేశారు. జిల్లాలో ఎక్కడ చూసినా గణేష్ నిమజ్జన సందడి నెలకొంది.

ప్రశాంతంగా శోభాయాత్ర

ఖమ్మం త్రీటౌన్‌లో స్తంబాద్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ శోభాయాత్రను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఉదయం 10గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్త మండళ్ల గణపయ్యలు సాయంత్రం 5గంటల తర్వాతనే కాల్వొడ్డు, ప్రకాశ్‌నగర్ నిమజ్జన ఘాట్‌లకు చేరాయి. పోలీసులు భక్తులను మూడంచెలుగా అనుమతించారు. బ్రహ్మణబజార్‌లోని శివాలయం వద్ద 32 అడుగులతో ఏర్పాటు చేసిన మట్టి మహాగణపయ్య శోభాయాత్రకు తరలించే సమయంలో ధ్వంసం కావటంతో అక్కడే ఫైరింజన్ సహాయంతో నిమజ్జనం చేశారు. బుడగ జంగాల ఆధ్వర్యంలో తీసుకొచ్చిన గణేశ్ పక్కన కొండపల్లి మహేశ్ అనే యువకుడు హనుమంతుడి వేషధారణలో రావటం భక్తులను ఆకట్టుకుంది. నిమజ్జన కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

బాహుబలి క్రెయిన్‌తో నిమజ్జనం

నిమజ్జనోత్సవం కోసం కేఎంసీ అధికారులు విజయవాడ నుంచి 60అడుగులు పొడవు, 360 డిగ్రీల కోణంలో తిరిగే బహుబలి క్రెయిన్‌లను నాలుగు తెప్పించారు. వీటితో పాటుగా మరో 9 క్రెయిన్‌లను నీటిలో నడిచే డోజర్‌లను వినియోగించారు. ముందస్తు జాగ్రత్తలో భాగంగా 300 మంది గజతగాళ్లను అందుబాటులో ఉంచారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలను చేపట్టారు. నిమజ్జన సమయంలో ఎక్కువగా నీరు లేకపోవటంతో విగ్రహాలు మునిగేందుకు సమయం పట్టింది. ఖమ్మం మేయర్ పునకొల్లు నీరజ, జాయింట్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్, పోలీసు కమిషనర్ సునీల్‌దత్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్, ఈఈ కృష్ణలాల్ నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.


భద్రాచలంలో బుజ్జి వినాయకుడిని నిమజ్జనానికి తీసుకొచ్చిన బుడతడు

సంస్కృతికి నిలయం గణేష్ ఉత్సవాలు


- విఘ్నేశ్వరుడి ఆసీస్సులతో జిల్లా అభివృద్ధికి కృషి
- శోభాయాత్ర ప్రారంభోత్సవంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల 6

భద్రాద్రికి తరలుతున్న గణపతులు

- నేడు కొత్తగూడెం, ఇల్లెందులో నిమజ్జనాలు 7

ఆడుకునేందుకు వెళ్లి..

- ప్రమాదవశాత్తు సీతారామ కాలువలో పడి ఇద్దరు చిన్నారులు మృతి
- సత్తుపల్లి మండలం బుగ్గపాడులో ఘటన


జితేందర్ (ఫైల్)


శశాంక్ (ఫైల్)

సత్తుపల్లి, సెప్టెంబరు 16: ఆడుకునేందుకు వెళ్లిన ఇద్దరు చిన్నారులు ప్రమాదవశాత్తు సీతారామ ప్రాజెక్టు కాలువలో పడి మృతి చెందిన ఘటన సోమవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామంలో జరిగింది. సత్తుపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుగ్గపాడు గ్రామానికి చెందిన మడిపల్లి శ్రీనివాసరావు, దేవీ దంపతుల పెద్ద కుమారుడు జితేందర్‌కుమార్ (11), పామర్తి కిషోర్, సుజాత దంపతుల చిన్న కుమారుడు శశాంక్(10) ఇద్దరూ కలిసి సోమవారం ఆడుకునేందుకు సీతారామ ప్రాజెక్టు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తూ ఇద్దరూ కాలువలో పడి మునిగిపోయారు.

సమీపంలో వ్యవసాయ పనులు చేస్తున్న కూలీలు వారిని గమనించి బయటకు తీశారు. కానీ అప్పటికే వారు మృతిచెందారు. చిన్నారులు ఇద్దరూ సత్తుపల్లిలోని ఒక ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. సోమవారం సెలవు కావడంతో జితేంద్రకుమార్, శశాంక్‌లు ఆడుకుంటూ గ్రామ సమీపంలోని సీతారామ కాలువ వద్దకు వెళ్లి అందులో పడిపోయారు. జితేంద్ర కుమార్ తండ్రి లారీడ్రైవర్ కాగా, తల్లి కూలీ పనులకు వెళుతోంది. శశాంక్ తండ్రి ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుండగా తల్లి కూలి పనులకు వెళుతోంది. సత్తుపల్లి పోలీసులు చిన్నారుల మృతదేహాలను శవపరీక్ష కోసం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బుగ్గపాడులో బాధితుల ఆందోళన

సీతారామ కాలువలో ప్రమాదవశాత్తూ పడి మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు న్యాయం చేయాలంటూ బాధితులతో పాటు గ్రామస్థులు, బంధువులు సోమవారం రాత్రి కాలువ పనులు చేస్తున్న కంపెనీ క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. కాలువ వద్ద ఎలాంటి పర్యవేక్షణ, ప్రమాద హెచ్చరికలు లేకపోవడంతో ఇద్దరు చిన్నారుల ప్రాణాలు కోల్పోయారని, తక్షణమే యాజమాన్యం బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా విషయమై సత్తుపల్లి పట్టణ సీఐ టీకిరణ్‌ను వివరణ కోరగా పిల్లల మృతి ఘటనపై కేసు నమోదు చేశామని తెలిపారు.

నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాది నెత్తుటి త్యాగాల చరిత్ర. భూమి, భుక్తి, విముక్తి కోసం ఊరూరా ఎందరో యోధులు పోరుబాట పట్టారు. దొరలకు, దేశ్‌ముఖ్‌లకు, భూస్వాములకు, జమీందార్లకు వ్యతిరేకంగా తుపాకులు చేతబూని కదన రంగంలో దూకారు. ప్రాణాలను లెక్కచేయక అలుపెరుగని పోరాటాలు సాగించారు. సంఘాలు, గెరిల్లా దళాలు ఏర్పాటు చేసుకొని, సొంతంగా ఆయుధసంపత్తిని సమకూర్చుకొని ప్రపంచం నివ్వెరపోయే రణం చేశారు. శక్తిమంతుడైన నిజాంతో నేరుగా తలపడి మట్టిమనుషుల మహారణాన్ని చరిత్రపుటల్లో లిఖించారు. అటు రజాకార్లు, ఇటు నైజాం పోలీసులు జరిపిన దాడుల్లో ఎందరో యోధులు ప్రాణాలు కోల్పోయారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పుడు ఏ పల్లెను తడిమినా నాటి పోరాట ఘట్టాలను, నెత్తుటి త్యాగాల గాథలను వినిపిస్తాయి. తెలంగాణా సాయుధ పోరాటానికి మంగళవారం (సెప్టెంబరు 17) 76 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆనాటి పోరాట ఘట్టాలను మననం చేసుకునే ప్రయత్నం ఇది...

- ఇల్లెందు/బోనకల్



మట్టి మనుషుల మహారణం

- నైజం నిరంకుశ పాలనపై గర్జించిన సామాన్యులు
- భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన మహోద్యమం
- ప్రాణాలను తృణప్రాయం చేసిన ఎందరో యోధులు
- చరిత్రకెక్కిన బోనకల్, గార్ల బయ్యారం పోరాట ఘట్టాలు
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏ పల్లెను తడిమినా నాటి గాథలే...
- రజాకార్ల వెన్నులో వణుకు పుట్టించిన ప్రజా గెరిల్లాలు
- గోవిందాపురం(ఎల్)లో ఒకే చితి పై ఏడుగురి దహనం
- నేడు హైదరాబాద్ సంస్థానం విలీనమైన రోజు 6

హద్దుమీరుతున్న ఆర్ఎంపీ వైద్యం

- భద్రాద్రి ఏజెన్సీలో స్థాయికి మించి వైద్యం చేస్తున్న గ్రామీణ వైద్యులు
- విలువైన సమయం వృథాచేసి చివరికి చేతులెత్తేస్తున్న వైనం
- దుమ్ముగూడెం మండలంలో మరో యువతి బలి
- బాధ్యులపై చర్యలు తీసుకోని వైద్య ఆరోగ్యశాఖ 6


మృతిచెందిన వరప్రద (ఫైల్)

భద్రాద్రి రాముడి పేరును వాడుకుంటున్నారు

- పోలీసులకు ఫిర్యాదు దేవస్థానం అధికారులు
- ఇద్దరు దేవస్థానం వైదిక సిబ్బందికి చార్జ్‌మెమో

భద్రాచలం, సెప్టెంబరు 16: భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి పేరును ఓ ప్రైవేటు సంస్థ తాము నిర్వహించే సీతారాముల కల్యాణానికి వాడుకుంటోందని భద్రాద్రి పట్టణ పోలీసులకు సోమవారం దేవస్థానం అధికారులు ఫిర్యాదు చేశారు. ఆగస్టు 17నుంచి సెప్టెంబరు 17వరకు శ్రీరామ టెంపుల్ ఆఫ్ యుఎస్ఏ ఖగోళయాత్రకు సంబంధించిన కరపత్రంలో సీతారామచంద్ర స్వామివారి మూలమూర్తుల ఫొటోతోపాటు మంగళవారం భద్రాద్రి శ్రీసీతారాముల వారి శాంతికల్యాణాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ప్రచురించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే శ్రీరామ టెంపుల్ ఆఫ్ యుఎస్ఏ పేరిట ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌లో సైతం భద్రాద్రి రామయ్య మూలవరుల చిత్రం ఉందని వారు పేర్కొన్నారు. సదరు సంస్థ నిర్వాహకులు భక్తుల నుంచి విరాళాలు సేకరిస్తున్నారని, దీని వల్ల ఈ కార్యక్రమం భద్రాద్రి శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానమే నిర్వహిస్తోందని భక్తులు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉందని వారు వాపోయారు. ఈ కార్యక్రమానికి నిర్వాహకులుగా వ్యవహరించిన అర్చకం పద్మనాభాచార్యులపై విచారించి తగిన చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్లు దేవస్థానం వర్గాలు పేర్కొన్నాయి. ఇదిలా ఉండగా భద్రాద్రి రామయ్య దర్శనం నిమిత్తం వచ్చిన కలెక్టరు జితేష్ వి పాటిల్‌కు ఈ విషయం గురించి అర్చకులు వివరించగా ఆయన ఎస్పీ దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నట్లు తెలిసింది. కాగా భద్రాద్రి రామయ్య పేరును కొంతమంది వ్యక్తులు ఆధ్యాత్మిక ముసుగులో అక్రమార్జన చేయాలనే ఉద్దేశ్యంతో ప్రయత్నించడాన్ని భద్రాద్రిప్రాంత పరిరక్షణ సమితి చైర్మన్ డా.బూసిరెడ్డి శంకర్‌రెడ్డి ఖండించారు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖలను కోరారు. ఇదిలా ఉండగా ఖగోళయాత్రకు వెళ్లిన భద్రాద్రి దేవస్థానం ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామాచార్యులు, ముఖ్య అర్చకులు పొడిచేటి సీతారాంలు ఈ కార్యక్రమానికి వెళ్లే సమయంలో దేవస్థానం అధికారులు ఇచ్చిన మార్గదర్శకాలను ఉల్లఘించారన్న ఆరోపణల నేపథ్యంలో వారికి దేవస్థానం ఈవో రమాదేవి చార్జ్‌మెమోలు జారీ చేసినట్టు సమాచారం.

నేడు తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

- ఖమ్మంలో పాల్గొననున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- కొత్తగూడెంలో పాల్గొననున్న మంత్రి తుమ్మల

ఖమ్మం(ఆంధ్రజ్యోతిప్రతినిధి)/కొత్తగూడెం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):భారతదేశంలో తెలంగాణ విలీనం రోజైన సెప్టెంబరు 17ను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రజాపాలన దినోత్సవాలు నిర్వహించనున్నారు. ఖమ్మం పోలీసుపరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే ఉత్సవాల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జాతీయజెండా ఎగురవేయనుండగా.. భద్రాద్రి కొత్తగూడెంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జాతీయజెండా ఎగురవేయనున్నారు. జిల్లాకు చెందిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వరంగల్ జిల్లాలో జాతీయజెండా ఎగురవేయనున్నారు.

నేటినుంచి కొత్తగూడెంలో అగ్రిటెక్నాలజీ ఎక్స్‌పో

కొత్తగూడెంలోని సింగరేణి ప్రకాశంస్టేడియం గ్రౌండ్‌లో మంగళవారం నిర్వహించనున్న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నారు. జాతీయజెండాను ఆవిష్కరణ అనంతరం వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఏర్పాటు చేసిన అగ్రి టెక్నాలజీ ఎక్స్‌పో తిలకించనున్నారు. పెద్ద నగరాలకే పరిమితమైన అగ్రిటెక్నాలజీ ఎక్స్‌పో కొత్తగూడెంలో ఏర్పాటు చేశామని, రైతులు అధికసంఖ్యలో స్టాల్స్‌ను సందర్శించి విజయవంతం చేయాలని మంత్రి కోరారు.

పేరుకే హోదా.. తీరని బాధ!

- 2012లో ఖమ్మం కార్పొరేషన్‌గా ఆవిర్భావం
- కానీ 12ఏళ్లుగా ఉద్యోగులు మాత్రం మునిసిపల్ కేడరే..
- పని చేస్తున్న ఉద్యోగులు 80..
- ఇంకా రావాల్సింది 159మంది
- విపత్తు కాలంలో అధికారులు సతమతం
- పర్యవేక్షణకు ఇతర శాఖలపై ఆధారం 7

ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం


డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

» విధుల్లో 700మంది పోలీసు సిబ్బంది

ఖమ్మంక్రైం, సెప్టెంబరు 16: గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం నిర్వహించిన నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. ఈనేపథ్యంలో ట్రాఫిక్, ఇతర పోలీసు సిబ్బంది సుమారు 700మంది విధులు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నగరంలో పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించి గణేష్ ఊరేగింపు కార్యక్రమాలు సజావుగా కొనసాగేలా చూశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో, ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిబ్బంది ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. గణేష్ విగ్రహాలు తీసుకువచ్చే వాహనాల డ్రైవర్లకు తనిఖీలు నిర్వహించారు. అదేవిధంగా నగరంలో మున్నేరు చుట్టుపక్కల ప్రాంతాల్లో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ జామ్ కాకుండా వచ్చిన వాహనాలను నిమజ్జనం అనంతరం దారిమళ్లించారు. ఈ సందర్భంగా పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది నిర్వహిస్తున్న విధులను పర్యవేక్షించారు. అదేవిధంగా మున్నేరు నిమజ్జన ప్రాంతంవద్ద ఫైర్ సిబ్బంది సైతం విధుల్లో నిమగ్నమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రెండు ఫైరింజన్లతోపాటు సిబ్బంది లైవ్‌జాకెట్లు ధరించి విధులు నిర్వహించారు.

భద్రాద్రిలో ఇకపై అన్ని విభాగాల్లో బార్‌కోడ్



» అక్టోబరులో అమలుకు రంగం సిద్ధం
» రామయ్య లడ్డూ తయారీకి రైతు డెయిరీ నెయ్యి వినియోగం

భద్రాచలం, సెప్టెంబరు 16: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలోని వివిధ విభాగాల్లో పారదర్శకత కోసం బార్‌కోడ్ విధానాన్ని అమలు చేసేందుకు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి చర్యలు తీసుకుంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శ్రీసీతారామలక్ష్మణులకు వస్త్రాలను సమర్పిస్తే వాటికి క్యూఆర్‌కోడ్ విధానంలో నమోదు చేసి స్టోర్స్‌కు పంపి అక్కడ రిజిస్టర్‌లో నమోదు తరువాత కాంట్రాక్టరుకు ఆ వస్త్రాలను అప్పగించనున్నారు. దేవస్థానం ప్రచారశాఖ విభాగంలో ఎవరైనా భక్తులు స్వామివారికి సంబంధించిన వస్తువులు కొనుగోలు చేస్తే వారికి బార్‌కోడ్ జనరేట్ చేసి బిల్లు ఇవ్వనున్నారు. ప్రొటోకాల్ విభాగంలో సైతం ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేసి ఫొటోలు తీసి టికెట్లపై వచ్చేలా ముద్రించి వాటితో ఆలయ దర్శనానికి అనుమతించనున్నారు. దేవస్థానం నిర్వహించే ఉచిత నిత్యాన్నదానానికి రామ భక్తులు వెళ్లేందుకు వారిని ప్రతీ రోజు ఉదయం 9 గంటల నుంచి ఆలయం మూసే వరకు బార్‌కోడ్‌తో ఫొటో తీసి అన్నదానం టోకెన్లను జారీ చేయనున్నారు. అన్నదాన సత్రం వద్ద వాటిని స్కాన్ చేసి భక్తులను అనుమతించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ అక్టోబరులో అధికారికంగా అమలుకు రంగం సిద్ధమవుతున్నట్లు దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి.

లడ్డూ, చెక్కర పొంగలి తయారీకి రైతు డెయిరీ నెయ్యి వినియోగం

రామాలయంలో లడ్డూ, చెక్కర పొంగలి ప్రసాద వినియోగానికి దేవస్థానం అధికారులు కరీంనగర్ డెయిరీకి చెందిన మిక్సిడ్ నెయ్యి(ఆవు, గేదె నెయ్యిని వినియోగించే వారు). అయితే ఈ నెల నుంచి జంగారెడ్డిగూడెం రైతు డెయిరీ వారి నెయ్యిని వినియోగిస్తున్నారు. ఇప్పటివరకు వినియోగించిన కరీంనగర్ రైతు డెయిరీ నెయ్యి ఒక కిలో రూ.621 ఉండగా, రైతు డెయిరీ నెయ్యి ఒక కిలో రూ.534గా ఉందని దేవస్థానం వర్గాలు పేర్కొన్నాయి. ప్రతి నెల ఏడు నుంచి ఎనిమిది వేల కేజీల నెయ్యిని దేవస్థానం అధికారులు వినియోగిస్తున్నారు. అయితే శ్రీరామనవమి, ముక్కోటి, ఇతర ముఖ్య ఉత్సవాల సమయంలో అదనపు నెయ్యిని వినియోగిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. మొత్తం మీద నెలకు 1.20 నుంచి 1.40 లక్షల కిలోల నెయ్యిని దేవస్థానం వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది.



ద్విచక్రవాహనంపై గణేష్

భద్రాచలం, సెప్టెంబరు 16: భద్రాచలంలోని పవిత్ర గోదావరిలో గణేష్ నిమజ్జనం సాగుతుండగా కొత్తగూడెం నుంచి శివకృష్ణ అనే యువకుడు ఫైఫైనాన్స్ సంస్థ కార్యాలయంలో తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న గణనాథున్ని ద్విచక్ర వాహనంపై తీసుకురావడం భక్తులను ఆకట్టుకుంది. కొత్తగూడెం నుంచి భద్రాచలం వరకు 40కి.మీ. ద్విచక్రవాహనంపై గణనాథుడ్ని భద్రాద్రి ఘాట్‌కు తీసుకొచ్చి గోదావరిలో నిమజ్జనం చేశారు.

రాష్ట్ర మూడో మహాసభను జయప్రదం చేయండి

భద్రాచలం, సెప్టెంబరు 16: ఈ నెల 22, 23 తేదీల్లో కొత్తగూడెం క్లబ్‌లో జరిగే ఏఐటీయూసీ అనుబంధ సంస్థ రాష్ట్ర ఆటో క్యాబ్, ప్రయివేటు మోటారు డ్రైవరు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మూడో మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య అన్నారు. సోమవారం బస్టాండు అవుట్‌గేటు వద్ద పోస్టర్లను ఆవిష్కరించి జీపు జాతాను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, కల్లూరి వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వర్లు, వేల్పుల మల్లికార్జునరావు, సాధనపల్లి సతీష్, కంభంమెట్టు శ్రీనివాస్, చిట్టిపోతుల కృష్ణయ్య, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ఈ నష్టానికి బాధ్యులెవరు?

» వరదల తాకిడికి తడిచిన బియ్యం
» రేషన్ దుకాణాలకు లబ్ధిదారుల బారులు
» బియ్యం లేవంటూ తిప్పిపంపుతున్న డీలర్లు





ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 15: "అనుకోకుండా వచ్చిన వరదలు ప్రజలను సర్వస్వం నాశనానికి గురిచేయగా... డీలర్లకు తీరని నష్టాన్ని మిగిల్చింది. వరదల నేపథ్యంలో రేషన్ దుకాణాల్లో ఉన్న బియ్యం తడిచిపోయి ఎందుకు పనికిరాకుండా పోయాయి. దీంతో వాటిని డంపింగ్ యార్డులకు తరలించిన అధికారులు వాటి స్థానంలో తిరిగి రేషన్ బియ్యాన్ని డీలర్లకు కేటాయించక పోవడంతో దుకాణాలకు లబ్ధిదారులు బారులు తీరుతున్నారు. దుకాణాల్లో బియ్యం స్టాకు లేకపోవడంతో లేవంటూ తిప్పి పంపతున్నారు. అసలే అష్ట కష్టాల్లో ఉన్న లబ్ధిదారులు, ప్రజలకు రేషన్ బియ్యం లేకపోవడంతో ఉస్సూరుమంటూ వెనుదిరుగుతున్నారు..!

327 క్వింటాళ్లు నష్టం!

ఖమ్మం నగరంలో 13 డివిజన్లలో వరదనష్టం సంభవించింది. వీటితో పాటు ఖమ్మం రూరల్ మండలం, నేలకొండపల్లి, చింతకాని మండలాల్లో రేషన్ దుకాణాల్లో బియ్యం వరద తాకిడికి నీట మునిగాయి. దాదాపు 13 దుకాణాల్లో 327 .91 క్వింటాళ్ల బియ్యం తడిచిపోయి ఎందుకు పనికిరాకుండా పోయాయి. దీంతో వాటి నుంచి వచ్చే దుర్వాసన భరించలేక జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలోనే డంపింగ్ యార్డుకు తరలించారు. కనీసం ఒక్కో డీలర్‌కు 10 నుంచి 40 క్వింటాళ్ల వరకు నష్టం వాటిల్లింది. అయితే వీటి స్థానంలో తిరిగి ఆయా దుకాణాలకు రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ పంపిణీ చేయలేదు. అధికారులు ఈ నష్టాన్ని గురించి ఉన్నతాధికారులకు పంపించినప్పటికీ ప్రత్యామ్నాయం మాత్రం చేయలేదు. దీంతో డీలర్లు తీరని ఇబ్బందులు పడుతున్నారు. దుకాణాలకు లబ్ధిదారులు బియ్యం కోసం వస్తుంటే స్టాకు లేదంటూ తిప్పి పంపిస్తున్నారు.

నష్టానికి బాధ్యులు ఎవరో...?

అనుకోకుండా జరిగిన ఈ నష్టానికి బాధ్యులు ఎవరనేది తెల్చడం లేదని డీలర్లు వాపోతున్నారు. ప్రతి నెలా స్టాకు ఉన్న బియ్యంతో లబ్ధిదారులకు ఒకటో తారీకు నుంచి 15 వరకు బియ్యం సరుకులు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్టాకు ఉన్న బియ్యం మెత్తం తడిచిపోవడంతో వాటి స్థానంలో తిరిగి పంపిణీ చేయక పోవడంతో రేషన్ డీలర్లు ఆందోళన చెందుతున్నారు. వాటి స్థానంలో బియ్యాన్నిపంపిణీ చేస్తే లబ్ధిదారులకు అందించనున్నట్లు చెబుతున్నారు. అసలే ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు కనీసం బియ్యాన్ని కూడా ఇవ్వలేరా అంటూ ప్రశ్నిస్తున్నారు.

నష్టంపై నివేదించాం

చందన్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి

రేషన్ దుకాణాల్లో తడిచిన బియ్యం వివరాలను లెక్కకట్టి ప్రభుత్వానికి రాష్ట్ర అధికారులకు నివేధించాం. డీలర్లు నష్టపోకుండా చర్యలు తీసుకుంటాం. కాకుంటే రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. త్వరలో వస్తాయని భావిస్తున్నాం. ప్రజలు, లబ్ధిదారులు సమీపంలో ఉన్న రేషన్ షాపు వద్దకు వెళ్లి పోర్టబులిటీ విధానంలో బియ్యాన్ని తీసుకోవచ్చు. ఎవరైనా డీలర్లు పోర్టబిలిటీలో బియ్యం ఇవ్వకుంటే ఫిర్యాదు చేయండి.

టీపీసీసీ అధ్యక్షుడికి రాయల అభినందనలు



ఖమ్మం సంక్షేమవిభాగం, సెప్టెంబరు 16: టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మహేష్‌కుమార్ గౌడ్‌కు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు మెక్క శేఖర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు కొంటెముక్కల నాగేశ్వరరావులు అభినందనలు తెలిపారు. సోమవారం గాంధీభవన్‌కు వెళ్లిన వారు టీపీసీసీ అధ్యక్షుడ్ని కలిసి సన్మానించారు. త్వరలో ఖమ్మం జిల్లా పర్యటనకు రావాలని కోరారు. అనంతరం రాజీవ్ గాంధీ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని, సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు.

రేషన్ డీలర్ల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు16: ఈ నెల 24న సంగారెడ్డి జిల్లా పఠాన్‌చెరువులో జరిగే రేషన్ డీలర్ల రాష్ట్రస్థాయి సదస్సుకు జిల్లాలోని రేషన్ డీలర్లందరు తరలివెళ్లి సదస్సును విజయవంతం చేయాలని భద్రాద్రి జిల్లా గౌరవ అధ్యక్షుడు భజరంగ్‌లాల్ బాహితి సోమవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో రేషన్ డీలర్లకు ప్రతి క్వింటాకు రూ.300 కమీషన్, గౌరవ వేతనం రూ.5000, హమాలీ దిగుమతి ఖర్చులు ఇస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. హామీలను నెరవేర్చుకోవటానికి ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శాసనసభ్యులు భైపాల్‌రెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్ పాల్గొంటారని పేర్కొన్నారు.

హద్దుమీరుతున్న ఆర్‌ఎంపీ వైద్యం

» భద్రాద్రి ఏజెన్సీలో స్థాయికి మించి వైద్యం చేస్తున్న గ్రామీణ వైద్యులు
» విలువైన సమయం వృధాచేసి చివరికి చేతులెత్తేస్తున్న వైనం
» తూరుబాకలో మరో యువతి బలి
» బాధ్యులపై చర్యలు తీసుకోని వైద్య ఆరోగ్యశాఖ

దుమ్ముగూడెం సెప్టెంబరు 16: ఆర్‌ఎంపీల అపరిమిత వైద్యం ఆగకపోవడంతో అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. శృతిమించిన వైద్యం చేస్తే క్రిమినల్ కేసులు తప్పవని వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు చేస్తున్న హెచ్చరికలు కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. ఈ హెచ్చరికలను గ్రామాల్లో ఆర్‌ఎంపీలు అస్సలు ఖాతరు చేయడం లేదు. ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాల్సిన ఆర్‌ఎంపీలు ధనదాహంతో అర్హత లేకపోయినా తమ స్థాయికి మించి వైద్యం చేస్తూ ఎడాపెడా అధిక మోతాదు ఇంజక్షన్లు ఇచ్చి అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నారు. ముఖ్యంగా భద్రాద్రి ఏజెన్సీ ప్రాంతంలో ఆర్‌ఎంపీల దందా హద్దుమీరుతోందన్న విమర్శలున్నాయి. ఇప్పటికే దుమ్ముగూడెం మండలంలో ఆర్‌ఎంపీల వైద్యానికి పదుల సంఖ్యలో ప్రజలు బలవ్వగా ఏ ఒక్క కేసులోనూ సరైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా పరిస్థితి తయారైంది. మృతుల బంధువులు పేద గిరిజనులు కావడంతో పాటు వైద్యశాఖ అధికారులు తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఏదో ఒక నివేదిక ఇచ్చి తప్పించుకోవడంతో ఆర్‌ఎంపీల మరణమృదంగానికి అడ్డు లేకుండా పోతోంది.

ఆర్‌ఎంపీ వైద్యంతో మరో యువతి మృతి

తాజాగా దుమ్ముగూడెం మండలం తూరుబాకకు చెందిన మోతూకూరి వరప్రద(21) అనే యువతి స్థానిక ఆర్‌ఎంపీ నిర్లక్ష్య వైద్యంతో ఆదివారం రాత్రి కన్నుమూసింది. డెంగ్యూ జ్వరంతో బాధపడుతున్న వరప్రదకు తూరుబాకలో ఒక ఆర్‌ఎంపీ నాలుగు రోజుల పాటు వైద్యం చేశాడు. ఎటువంటి రక్త పరీక్షలు లేకుండా ఇష్టారీతిన ఇంజక్షన్లు, మందులు, సెలైన్లు ఇచ్చాడు. కానీ జ్వరం తగ్గకపోగా యువతి ఆరోగ్య పరిస్థితి విషమంగా మారింది. దాంతో మెరుగైన వైద్యం కోసం ఈ నెల 13న ముందు ఆమెను భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి తరలించారు. తరువాత 14న ఖమ్మంకు తరలించారు. సదరు ఆర్‌ఎంపీ సకాలంలో మెరుగైన చికిత్సల కోసం రిఫర్ చేయకపోవడంతో వరప్రద మృతిచెందిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్య పరిభాషలో గోల్డెన్ పిరియడ్‌గా భావించే సమయాన్ని వృధా చేస్తున్న కొందరు ఆర్‌ఎంపీలు రోగి పరిస్థితి విషమించే వరకు వైద్యం చేసి చివరి నిముషాల్లో చేతులెత్తేస్తున్నారు.

ఎంతమంది చనిపోయినా పట్టించుకోని వైద్యశాఖ

గత ఏడాది ఒక వారంలోనే కాటాయిగూడెంలో సరోజిని, పెదకమలాపురంలో శిరీష ఆర్‌ఎంపీల వైద్యానికి బలయ్యారు. ఈ రెండు సంఘటనల్లోనూ వైద్యం వికటించడంతోనే ఇద్దరు వివాహితలు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. తూరుబాకలో 2013లో సైదులు అనే ఆర్‌ఎంపీ ఒక చిన్నారికి వైద్యం చేసి ప్రాణాలు తీశాడు. తాజాగా తూరుబాకకు చెందిన వరప్రద అనే యువతి ఆర్‌ఎంపీ నిర్లక్ష్యానికి బలైంది. అలాగే కొందరు ఆర్‌ఎంపీలు అబార్షన్లు చేయడం, పెద్దా చిన్నా అనే తేడా లేకుండా ఎవరికి పడితే వారికి ఇంజక్షన్లు చేయడం, అనుమతుల్లేకుండా మందులను బ్యాగుల్లో వేసుకొని ఊరూరా తిరిగి వైద్యం చేయడం పరిపాటిగా మారింది. దుమ్ముగూడెం మండల వ్యాప్తంగా సుమారు 50 మంది ఆర్‌ఎంపీలుండగా, వీరిలో ఎక్కువ శాతం ఏజెన్సీ లోతట్టు గ్రామాల్లో స్థాయికి మించి వైద్యం చేస్తున్నవారే ఉన్నారు. వీరి వైద్యంతో ఆదివాసీలు కిడ్నీ, ఇతర దీర్ఘకాలిక వ్యాధుల భారిన పడుతున్నారు. ఇలాంటి వారిపై మీడియా అప్రమత్తం చేస్తున్నా ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన జిల్లా వైద్యఆరోగ్యశాఖ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో ఆర్‌ఎంపీల అపరిమిత వైద్యం ఆగడం లేదు.

పెళ్లికావాల్సిన యువతి బలైపోయింది

భద్రాచలంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న వరప్రదకు వివాహం కుదిరి ఎంగేజ్‌మెంట్ కూడా అయ్యింది. త్వరలోనే వివాహం జరగాల్సి ఉంది. కానీ ఆర్‌ఎంపీ వైద్యం బారినపడి అనంతలోకాలకు వెళ్లిపోయింది. వరప్రద మృతితో తూరుబాకలో విషాదఛాయలు అలుముకున్నాయి. అపరిమిత వైద్యంతో అమాయకుల ప్రాణాలను బలిగొంటున్న ఆర్‌ఎంపీలపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై నరసాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సుభాష్‌ను వివరణ కోరగా, తన వద్ద ప్రాథమిక సమాచారం మాత్రమే ఉందని త్వరలో పూర్తిస్థాయి వివరాలు సేకరించి జిల్లా అధికారులకు నివేదిస్తామన్నారు.

మట్టి మనుషుల మహారణం

నేడు హైదరాబాద్ సంస్థానం విలీనమైన రోజు

ఇల్లెందు/బోనకల్, సెప్టెంబరు 16 : నిజాం నిరంకుశ పాలన కొనసాగుతున్న రోజుల్లో తెలంగాణలోని ప్రజల జీవితాలు దుర్భరంగా ఉండేవి. నిజాం ప్రభుత్వానికి పట్టుగొమ్మలుగా ఉన్న జాగీర్‌దార్లు, జమీందార్లు, దేశ్‌ముఖ్‌లు భూస్వాములు ప్రజల రక్త మాంసాలను పీల్చి పిప్పి చేస్తున్న రోజులవి. నాటి వరంగల్ జిల్లాలో దొడ్డి కొమురయ్య బలిదానం నైజాం వ్యతిరేక పోరాటానికి ఊపిరులూదింది. వెట్టి మనుషులు ఏకమై భూస్వాములపై, నిజాం దాష్టీకాలపై రజాకార్ల ఆకృత్యాలపై బంధూకులెత్తారు. ఆడ మగ తేడా లేకుండా వడిశెల్లో రాళ్లతో, రోకలి బండలు, కారంపొడులతో ఉద్యమంలో ఉరకలెత్తారు. కత్తుల వంతెనపై కవాతు చేస్తూ గెరిల్లాయుద్ధ తంత్రాలతో రక్తతర్పణలు చేశారు. భూమి, భుక్తి, విముక్తి పోరు.. మహోద్యమంగా మారి నిజాం రాచరిక పాలనను అంతం చేసింది.

త్యాగాలకుగుర్తులు... అమరుల స్థూపాలు...

నాటి సాయుధ పోరాటంలో జరిగిన రక్త చరిత్రకు నిలువెత్తు సాక్ష్యాలు, నేడు గ్రామాల్లో దర్శనమిస్తున్న అమర వీరుల స్థూపాలు. చిరునోముల గ్రామానికి చెందిన బోడేపుడి శేషయ్య దళ సభ్యులతో కాపాలా ఉండగా నైజాం సైన్యం చుట్టుముట్టి కాల్పులు జరుపగా ఆయన పొట్టలో నుంచి పేగులు బయట పడ్డాయి. అయినా లెక్క చేయకుండా పేగులను పొట్టలో వేసుకుని నడుంకు గుడ్డ చుట్టుకొని రజకార్ల పై తుపాకి గుండ్ల వర్షం కురిపించి నేలకొరిగాడు. కటారి రామకోటయ్య కూడ ప్రాణాలు కోల్పోగా, నిమ్మతోట జగ్గయ్య ప్రాణాల నుంచి తప్పించుకున్నాడు. అలాగే బ్రాహ్మణపల్లికి చెందిన గాదే మాదవరెడ్డి, పైడిపల్లి జోగయ్య, పుల్లయ్యలు కలిసి రజాకార్ల మూకలు రాత్రివేళల్లో చేస్తున్న లూటీలను ఎదిరించిన క్రమంలో మాదవరెడ్డిని చంపగా, జోగయ్య, పుల్లయ్యలు వారి వద్ద ఉన్న నాటు బాంబులు వేసి తప్పించుకున్నారు.

రెండు పాయలుగా సాగిన పోరాటం

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెండు పాయలుగా సాగింది. భారతదేశమంతటికీ 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం రాగా, హైదరాబాద్ సంస్థానం మాత్రం ఇండియాలో విలీనానికి సానుకూలంగా స్పందించలేదు. దీంతో ఖమ్మం జిల్లాకు చెందిన జమలాపురం కేశవరావు, బొమ్మకంటి సత్యనారాయణ, మాదిరాజు రామకిషన్ రావు హీరాలాల్ మోరియా, దాశరధి రంగాచార్య, జలగం వెంగళ్ రావు, శీలం సిద్దారెడ్డి, గెల్లా కేశవరావులాంటి యోధులు కాంగ్రెస్ నాయకత్వంలో నిజాం వ్యతిరేక ఆందోళనలు సాగించారు.

ఇక మరో పాయగా సాయుధ రైతాంగ పోరాటం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మహోద్యమంగా సాగింది. ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ అందించిన చైతన్యంతో సర్వదేవభట్ల రామనాధం, ముగ్దుం మొహియొద్దీన్, మంచికంటి రామకిషన్ రావు, నల్లమల గిరి ప్రసాద్, గంగవరపు శ్రీనివాసరావు, రావెళ్ల జానకి రామయ్య, రాజ్ బహదూర్ గౌర్, గాదె మాధవ రెడ్డి, కేఎల్ నర్సింహారావు తదితరులు సాయుధ పోరాటం సాగించారు. భూ స్వాముల పెత్తనాలను, వెట్టి చాకిరి, అధిక వడ్డీలు, కౌలు దోపిడి, నిర్బంధ లేవీ దాన్యం సేకరణలకు నిరసనగా ప్రజలను సమరశీల పోరాటాలకు సిద్దం చేశారు. తుపాకులు చేతపట్టి గెరిల్లా పోరాటాలతో నిజాం సైన్యాలపై, రజాకార్లపై సాగించిన సాయుధ పోరాటం ప్రపంచంలోనే ఖ్యాతి ఘడించింది. నిజాం అనుకూల రజాకర్ మూకలు సాగించిన దురాగతాలు నెత్తుటి ధారలను పారించాయి. వారి ఆకృత్యాలతో ఊర్లకు ఊర్లే చిత్రహింసలతో అట్టుడికాయి.

నెత్తిరోడిన గార్ల జాగీరు

బాంచన్ బతుకులు సాయుధ పోరుకు దిగడంతో ఇల్లెందు నియోజకవర్గంలోని గార్ల జాగీరు రక్తసిక్తమైంది. గ్రామాల్లో రజాకార్ల ఆకృత్యాలను ప్రతిఘటించేందుకు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో వాలంటీర్ దళాల నిర్మాణం జరిగింది. ఇల్లెందు నియోజకవర్గంలోని బయ్యారం, గార్ల, కోటగడ్డ, బండ్లకుంట, సమీపంలో మానుకోట ప్రాంతాల్లో తీవ్ర స్థాయిలో ప్రతిఘటనలు జరిగాయి. గార్ల జాగీరు తహసీల్దార్ కొడుకు రషీద్ మియా మహిళలకు ఆకతృత్యాలకు పాల్పడుతుండటంతో పెత్తాళ్లగడ్డ గ్రామంలో గెరిల్లా దళం అతడిపై దాడి జరిపింది. నూరుద్దీన్ అనే తహసీల్దార్ వేదనాయక పురంలో భూములను స్వాధీనం చేసుకునేందుకు పూనుకోగా దామినేని వెంకటేశ్వరరావు, తుమ్మ శేషయ్యల నాయకత్వంతో గెరిల్లా దళాలు దాడులకు పూనుకోవడంతో ఆ గ్రామంలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. కోటగడ్డ గ్రామంలో రంగారెడ్డి దేశ్‌ముఖ్ ప్రజలపై అరక పన్నులు విధించడం, ఎదురించిన వారి ముఖానికి కారం ముద్దలు కట్టి హింసించడం వంటి క్రూరమైన చర్యలకు పాల్పడేవాడు. దీంతో గెరిల్లా దళాల నాయకత్వంలో స్థానిక ప్రజలు బరిసెలు, కత్తులు, గొడ్డళ్లతో ప్రతిఘటించి దేశ్‌ముఖ్‌ను హతమార్చారు. ఈ మూడు ఘటనలతో నిజాంసైన్యాలు సాయుధ పోరాటంపై నిర్బంధానికి పూనుకున్నాయి. వారు జరిపిన అణచివేతలో బయ్యారం సమీపంలోని బండ్ల కుంటలో దళకమాండర్లు కామినేని వెంకటేశ్వరరావు, కంచర బుచ్చిమల్లుతో పాటు 41 మంది గెరిల్లా యోధులు బలయ్యారు.

రజకార్ల వెన్నులో వణుకుపుట్టించిన యోధులు

నాడు వరంగల్ జిల్లాలో అంతర్భాగమైన నేటి మధిర తాలుకా బోనకల్ మండలం చిరునోముల గ్రామానికి చెందిన సాయుధ పోరాట యోధుడు రావెళ్ల జానకీరామయ్య ఆంధ్ర మహాసభ జిల్లా అధ్యక్షుడిగా, కమ్యునిస్టు పార్టీ కార్యదర్శిగా వ్యవహరించేవారు. ఆయన గోవిందాపురం(ఎల్), చిరునోముల, లక్ష్మీపురం, తూటికుంట్ల, ముష్టికుంట్ల, ఆళ్లపా డు, బ్రాహ్మణపల్లి, ప్రొద్దుటూరు, సీతానగరం, తూటికుంట్ల గ్రామాలల్లోని యువకులను ఉద్యమకారులుగా తీర్చిదిద్దారు. వీరిలో లక్ష్మీపురానికి చెందిన మల్లెల వెంకటేశ్వర్లును దళ కమాండర్‌గా, గోవిందాపురం(ఎల్)కు చెందిన తమ్మారపు గోవిందు, చుండూరు నర్సింహరావు, జొన్నలగడ్డ రామయ్యలను ప్రజా నాయకులుగా నియమించుకుని యువకులైన రావూరి వెంకట రామయ్య, విశ్వనాధం, తమ్మారపు భద్రయ్య, తమ్మారపు మస్తాన్, తమ్మారపు భూషయ్య, చుండూరి కృష్ణమూర్తి, ఉమ్మినేని ఆదినారాయణ, తుళ్లూరి రత్తయ్య, తుళ్లూరి శంకరయ్య, కొంగర నర్సయ్య, ఆకేన వెంకట రాములు, నల్లమల్ల గోపయ్య, మందడపు బుచ్చయ్య, పారుపల్లి జోగయ్య, పుల్లయ్య, గాదే మాదవరెడ్డి, నారాయణరెడ్డి, పిచ్చిరెడ్డి, పైడిపల్లి జోగయ్య, కిలారి దశరథ రామయ్య, నిమ్మతోట జగ్గయ్య, బోడేపుడి శేషయ్య, తమ్మారపు హుస్సేన్‌లతో పాటు పలువురు పోరాట యోధులుగా తీర్చిదిద్దారు. వీరు తుపాకులు చేతబూని బందీలో ఉన్న ధాన్యం, వందలాది ఎకరాలను విడిపించి పేదలకు పంపిణీ చేశారు. బోనకల్‌కు సరిహద్దులో ఉన్న నాటి కృష్ణా జిల్లా వత్సవాయి క్యాంపుగా ఏర్పాటు చేసుకొని పోరాటం సాగించారు.



ఒకే చితిపై ఏడుగురిని దహనం చేసిన చోట ఏర్పాటు చేసిన స్థూపం

ఒకే చితిపై ఏడుగురి దహనం

సాయుధ పోరాటాన్ని అణిచి వేయాలన్న లక్ష్యంతో నైజాం నవాబు ఉద్యమకారులపై దాడులను తీవ్రతరం చేశాడు. బోనకల్ మండలం ఆళ్లపాడు గ్రామానికి చెందిన యలమందల రామచంద్రయ్య, మందా అచ్చయ్య, వల్లాపురంకు చెందిన గొర్రెముచ్చు అజరయ్య, మద్ది రాములు, రేపల్లెవాడుకు చెందిన మడుపల్లి వీరస్వామి, సామినేని గోపయ్య, తమ్మినేని బుచ్చయ్య, గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన కొత్తపల్లి కృష్ణమూర్తి, గోవిందాపురం(ఎ)కు చెందిన బాగం శరయ్యలతో పాటు మరి కొందరిని బందించి చిత్రహింసలు పెట్టారు. వీరిలో ఏడుగురిని కాల్చిచంపి మృతదేహాలను గోవిందాపురం(ఎల్) గ్రామానికి తీసుకొచ్చి గుర్రాలకు కట్టి వీదుల్లో ఈడ్చుకుంటూ గ్రామ శివారు ప్రాంతమైన మంగల గుట్ట వద్ద ఒకే చితి పై ఏడుగురి మృతదేహాలను పేర్చి ఖననం చేశారు. నైజాం సైనికులు పట్టుకున్న వారిలో కొత్తపల్లి కృష్ణమూర్తి, బాగం శరయ్యలను మాత్రం చంపకుండా విడిచి పెట్టారు.

సంస్కృతికి నిలయం గణేష్ ఉత్సవాలు

విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో జిల్లా అభివృద్ధికి కృషి

శోభాయాత్ర ప్రారంభోత్సవంలో మంత్రి తుమ్మల

ఖమ్మం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) దేశంలో పల్లెనుంచి పట్టణం వరకు పేద, ధనిక తేడా లేకుండా సర్వమతాలవారు నిర్వహించుకునే సంబురాలే గణేష్ ఉత్సవాలని, ఇవి మన సంస్కృతి సంప్రదాయాలను చాటిచెబుతాయని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గణేష్ ఉత్సవాల స్ఫూర్తిగా సమైక్యను కొనసాగించాలని పేర్కొన్నారు. ఖమ్మంలో గణేస్ నిమజ్జనం సందర్భంగా సోమవారం స్థంబాద్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రను మంత్రి తుమ్మల జెండా ఊపి ప్రారంభించారు. ఈ సదర్భంగా అయన మాట్లాడుతూ ప్రజలంతా ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆనందంగా గణేష్ నిమజ్జనం నిర్వహించాలని సూచించారు. ఇది ప్రకృతికి సంబంధించిన పండుగ అని, భవిష్యత్‌లో అందరూ మట్టి విగ్రహాల ఏర్పాటుకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మట్టి విగ్రహాలు లేకపోతే నిమజ్జనానికి అనుమతించబోమన్నారు. ఈ విషయంపై ఉత్సవ కమిటీలు కఠిన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. గణేష్ ఉత్సవాలతో అందరికీ మంచి జరగాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలు, మున్నేరు వరదలతో ఖమ్మం ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నా అధికారులు, ప్రభుత్వం, ప్రజలు సమిష్టిగా పనిచేసి బాధితులను మళ్లీ సాధారణ స్థితికి తీసుకురావడం సంతోషకరమన్నారు. ప్రజల సహకారం, విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ఖమ్మం పట్టణంతో పాటు జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ శోభాయాత్రలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునిల్‌దత్, మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, స్తంబాద్రి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వినోద్ లహోటీ, నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దీపక్‌చౌదరి, నాయకుడు బాలగంగాధర్‌తిలక్, సాధు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిల్డింగ్ పై నుంచి దూకిన వ్యక్తి ఆచూకీ లభ్యం

ఖమ్మం క్రైం సెప్టెంబరు 16: నిర్మాణంలో ఉన్న ఓ బిల్డింగ్ పై నుంచి దూకి ఓ యువకుడు మృతి చెందిన సంఘటనపై సదరు యువకుడి ఆచూకీ లభ్యమైంది. ఖమ్మం టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఒంగోలు జిల్లా కనిగిరికి చెందిన మలినేని కళ్యాణ చక్రవర్తి(28)నగరంలో గత కొంతకాలంగా నివాసం ఉంటూ ఓ ప్రైవేటు సంస్థలో విధులు నిర్వహించాడు. తరువాత హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. ఖమ్మం లో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఓ వివాహితతో వివాహేతర సంబంధం ఏర్పడింది. దీంతో ఆమె వద్ద నుంచి రెండు లక్షలు అప్పుగా తీసుకొని తిరిగి ఇవ్వకపోవడంతో ఆదివారం అతడు ఖమ్మం రావడంతో వివాహిత కుటుంబ సభ్యులు అతడిని చూసి వెంటపడ్డారు. దీంతో భయపడిన అతను నిర్మాణంలో ఉన్న భవనం పై నుంచి దూకి మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ హోంగార్డు చందర్ మృతి



చందర్(ఫైల్)

కారేపల్లి, సెప్టెంబరు16: ఖమ్మం ట్రాఫిక్‌పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న భూక్యా చందర్(40)సోమవారం ఖమ్మం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఖమ్మంలో విధులు నిర్వహించేందుకు ఆదివారం ఉదయం మాధారం నుంచి తన ద్వి చక్ర వాహనంపై ఖమ్మం వెళ్తుండగా, చీమలవారిగూడెం గ్రామసమీపంలో అదుపుతప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని వెంటనే ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఏఎస్‌ఐ రాజకుమారి తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. హోంగార్డుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు కింద పడి వ్యక్తి..



శ్రీరామ్ (ఫైల్)

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు16: ఆర్టీసీ బస్‌ను ఓవర్ టేక్ చేస్తూ ప్రమాదవశాత్తూ ఆ వాహనం కింద పడి అక్కకడిక్కడే ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన సత్తుపల్లిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లి మండలంలోని చెరుకుపల్లికి చెందిన తాటి రవి, అనసూయ దంపతుల చిన్న కుమారుడు శ్రీరామ్ (19) కూలి పనులకు వెళ్తుంటాడు. సోమవారం సత్తుపల్లికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా, వై జంక్షన్ దాటిన తర్వాత పాత మహాలక్ష్మి క్యాం ప్ వద్ద సత్తుపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సు ఖమ్మం నుంచి సత్తుపల్లికి వస్తుంది. ఈ క్రమంలో బస్సును వెనుక నుంచి డివైడర్ పక్క నుంచి ఓవర్ టేక్ చేస్తుండగా, రహదారిపై ఉన్న గుంతను తప్పించబోయి బస్ వెనుక టైర్ కింద పడిపోయాడు. కొంత దూరం వరకు బస్సు అతడిని లాక్కొని వెళ్లడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సత్తుపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు..



రమేష్‌బాబు(ఫైల్)

ముదిగొండ, సెప్టెంబరు 16: గుండెపోటుతో ఓ ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని బాణాపురం గ్రామంలో చోటుచేసుకుంది. బాణాపురం గ్రామానికి చెందిన వట్టికూటి రమేష్‌బాబు(46)నేలకొండపల్లి మండలం అప్పలనర్సింహాపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం గ్రామంలో వాకింగ్ చేస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. చికిత్స నిమిత్తం ఖమ్మం ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రమేష్‌బాబు మృతదేహాన్ని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కృష్ణమోహన్, విజయ్, అమృత్‌రాజు, మాధవరావు, నాగేశ్వరరావు, రత్నాకర్, సత్యనారాయణ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి, సంతాపం తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..



సరోజిని(ఫైల్)

నేలకొండపల్లి, సెప్టెంబరు16: మండల పరిధిలోని మంగాపురంతండాకు చెందిన సీపీఎం నాయకుడు, గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూక్యా కృష్ణ సతీమణి సరోజిని(55) సోమవారం ఉదయం మృతి చెందారు. కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ సరోజిని ఖమ్మంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల వెంకట్రామారెడ్డి, నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, ఏటుకూరి రామారావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, కట్టికోల వెంకటేశ్వర్లు, దుగ్గి వెంకటేశ్వర్లు, సామాల మల్లికార్జురావు తదితరులు నివాళులర్పించి, మృతురాలి కుటుంబానికి సంతాపం తెలిపారు. తొలుత మృతురాలిపై సీపీఎం జెండాను పార్టీ నాయకులు కప్పారు.

వేడి నీటిలో పడి చిన్నారికి గాయాలు

చర్ల, సెప్టెంబరు 16: వేడి నీటిలో పడి ఓ చిన్నారికి తీవ్ర గాయాలైన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కారం సాయి వరుణ్ ఆడుకుంటూ పొయ్యి మీద మరుగుతున్న నీటిపై పడ్డాడు. దీంతో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు గుర్తించి చర్ల వైద్యశాలకు తరలించారు. చర్ల వైద్యులు సాయి వర్ధన్ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్య ఖర్చుల నిమిత్తం చర్లకు చెందిన దేవభక్తుని రామకృష్ణ రూ.5వేల సాయం అందించారు.

వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై ఫొక్సో కేసు

పెనుబల్లి, సెప్టెంబరు 16: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన షేక్.బడేమియా అనే వ్యక్తిపై ఫొక్సో, అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు వీఎంబంజర్ ఎస్‌ఐ కె.వెంకటేష్ సోమవారం తెలిపారు. ఈనెల 12న పాఠశాల నుంచి వచ్చిన బాలికను అతడు వేధిస్తుండగా బాలిక నాయనమ్మను గమనించి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ విషయమై బాధితురాలి తల్లి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు అతడిపై ఫొక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వ భూమిలో నరికిన కలప పట్టివేత

జూలూరుపాడు, సెప్టెంబరు16: ప్రభు త్వ భూమిలో అక్రమంగా నరికిన కలపను అటవీశాఖాధికారులు పట్టుకున్న సంఘటన సోమవారం జూలూరుపాడు చోటుచేసుకుంది. ఎఫ్‌ఆర్‌వో ప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం.. జూలూరుపాడు రెవెన్యూ పరిధిలోని పత్తి ఉపమార్కెట్ యార్డు సమీపంలో గల రెవెన్యూ భూమిలోని గుట్టపై ఉన్న నర్లంటి, చింతా, బెంబిడాలు తదితర రకాలకు చెందిన అడవి జాతి మొక్కలను జూలూరుపాడు గ్రామానికి చెందిన కే. శ్రీనివాసరావు, రామచంద్రాపురం గ్రామానికి చెందిన జి. రాములు అనే ఇద్దరు వ్యక్తులు కలిసి అక్రమంగా కలిసి విక్రయించేందుకు ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు తమ సిబ్బంది అక్కడికి చేరుకుని కలపను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన కలప సుమారు 3టన్నులు ఉంటుందని విచారణ అనంతరం కేసు నమోదు చేస్తామని తెలిపారు.

గట్టుసింగారంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

కూసుమంచి, సెప్టెంబరు 16: మండలంలోని గట్టుసింగారం గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈఘర్షణలో గ్రామానికి చెందిన లొడిగ సుహాసిని అనే మహిళకు గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వెంటనే ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈఘటనపై విచారణ నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు విలేకరులకు తెలిపారు.

గణేష్ నిమజ్జనంలో రెండు వర్గాల ఘర్షణ

ఖమ్మం క్రైం సెప్టెంబరు 16: గణేష్ నిమజ్జనం సందర్భంగా రెండు వర్గాలు ఘర్షణకు దిగిన సంఘటన సోమవారం ఖమ్మం నగర పరిధిలో జరిగింది. నగర పరిధిలోని దానవాయిగూడెంకు చెందిన కొంతమంది వినాయకుని నిమజ్జనం సందర్భంగా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. దీంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరగటంతో అదే ప్రాంతానికి చెందిన కృష్ణ అనే వ్యక్తికి గాయాలు అయ్యాయి. దీంతో స్థానికులు గాయపడిన వ్యక్తిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సిఉంది.

వినాయకుని శోభాయాత్రలో అపశృతి

కూసుమంచి, సెప్టెంబరు 16: మండలంలోని లోక్యాతండాలో వినాయకుని నిమజ్జనంలో అపశృతి చోటుచేసుకుంది. విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఉంచి ఊరేగిస్తుండగా, పక్కకు ఒరిగింది. ఈక్రమంలో ట్రాక్టర్‌లో వినాయకుని విగ్రహం పక్కనే వడిత్య కృష్ణ కుమారుడు గోపి(7) కూర్చున్నాడు. విగ్రహం ఒరగడంతో ట్రాలీ డోర్‌కు, విగ్రహానికి మధ్య బాలుడు పడిపోయాడు. వెంటనే స్థానికులు కూసుమంచి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

● సీపీఆర్ చేసి యువకుడిని బతికించిన ఆంధ్రజ్యోతి ఏజెంట్



సమద్‌కు సీపీఆర్ చేస్తున్న రాము

కూసుమంచి, సెప్టెంబరు 16: ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై నాయకన్ గూడెం అండర్‌పాస్ వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు..బైక్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో కూసుమంచికి చెందిన ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలయ్యాయి. పవర్‌స్ప్రేయర్ల మెకానిక్ యాఖుబ్ కుమారుడు సమద్, చిరువ్యాపారం చేసుకుని జీవిస్తున్న రామలింగం కుమారుడు శివకు తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో సమద్‌కు శ్వాస తీసుకునే విషయంలో ఇబ్బంది పడుతుండటంతో అక్కడే ఉన్న నాయకన్‌గూడెం ఆంధ్రజ్యోతి ఏజెంట్ చిలకబత్తిన రాము సీపీఆర్ చేసి బతికించాడు. వెంటనే హైవే వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కూసుమంచి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేరుకే హోదా.. తీరని బాధ !

- 2012అక్టోబరు 19న కార్పొరేషన్‌గా ఆవిర్భావం
- కానీ 12ఏళ్లుగా ఉద్యోగులు మాత్రం మునిసిపల్ క్యాడరే..
- కార్పొరేషన్ క్యాడర్‌లో ఉండాల్సిన ఉద్యోగులు 237
- పనిచేస్తున్నది 80 మంది
- ఇంకా రావాల్సిన ఉద్యోగులు 159 మంది
- విపత్తుల కాలంలో అధికారులు సతమతం
- పర్యవేక్షణకు ఇతర శాఖలపై ఆధారం



ఖమ్మం నగర పాలక సంస్థ

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 16: రోజు రోజుకు ఖమ్మం నగరం విస్తరిస్తోంది. ఆ మేరకు నివాసాలు, కుటుంబాలు పెరుగుతున్నాయి. జనాభా పెరుగుదలతో ఖమ్మం పురపాలక సంస్థ హోదా మారి నగరపాలక సంస్థగా రూపాంతరం చెందింది. ఆ మేరకు ఖమ్మం నగరపాలక సంస్థ నుంచి దండిగా ఆదాయం వస్తుంది. కేఎంసీ నుంచి రాష్ట్ర ఆర్థిక అవసరాలకు నిధులు తీసుకెళ్తున్న రాష్ట్ర అధికారులు నిబంధనల మేరకు ఖమ్మం నగర పాలక సంస్థకు రావాల్సిన ఉద్యోగ నియామకాలను చేపట్టటం లేదు. మునిసిపల్ కార్యాలయంలో ఉన్న అధికారులు, ఉద్యోగులే కార్పొరేషన్‌గా హోదా మారినా పనిచేస్తున్నారు. కానీ నూతనంగా ఒక్క అధికారిని నియామకం జరగలేదు. కాగా ఇటీవల సాధారణ బదిలీల్లో ఇంజనీరింగ్, ప్లానింగ్, శానిటేషన్, ఇతర విభాగాల ఉద్యోగులు కేఎంసీ నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో బదిలీపై ఎవ్వరూ ఖమ్మానికి రాలేదు. ఈలోపుగానే ఖమ్మం నగరాన్ని మున్నేరు ముంచేత్తింది. ఇంకే ముంది ఉన్న కమిష[illegible]

సీడీఎంఏకు లేఖ రాశాం..

● అభిషేక్ అగస్త్య, కమిషనర్, ఖమ్మం నగరపాలక సంస్థ



[illegible] ఉద్యోగులకు వారం రోజులుగా కంటిమీద కునుకు లేదు. ఇతర ప్రాంతాల నుంచి [illegible] వస్తే వారికి [illegible] 3గంటల వరకు [illegible] జరిగింది.

2012 నుంచి మునిసిపాలిటీ సిబ్బందితోనే..

[illegible] పర్యవేక్షణకు అధికారులను నియామకం చేయాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలిచ్చారు. ఫైల్ పరిశీలనలో ఉంది. [illegible] ఖమ్మం మునిసిపాలిటీ పరిధిలో జనాభా పెరగడంతో 2012 అక్టోబరు 19న ఖమ్మం నగర (కార్పొరేషన్) పాలక సంస్థగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి, [illegible] విభాగాల్లో అధికారులు, ఉద్యోగుల నియామకం జరుగుతోంది.

కేంద్రానికి ఆ విషయాన్ని అధికారికంగా తెలిపింది. ఈ మేరకు జీవో నెంబర్ 399ను విడుదల చేసింది. తర్వాత ఖమ్మం నగర పాలక సంస్థగా హోదా పెరిగిన తర్వాత జీవో నెంబర్ 218 మేరకు క్యాడర్ స్ట్రేంత్‌ను పెంచాల్సి ఉంటుంది. 8ఏళ్లుగా ఖమ్మం నగర పాలక సంస్థ నుంచి ఆదాయం దండిగానే వస్తోంది. హైదరాబాద్ వంటి మహానగరాలు ఇతర నగరాలకు సైతం గత ప్రభుత్వంలో ఖమ్మం నగర పాలక సంస్థ నిధులను వినియోగించారు. కానీ 12ఏళ్లుగా కేఎంసీకి కావాల్సిన ఉద్యోగుల నియామకాలు మాత్రం జరగలేదు.

అధికారుల నియామకంపై మంత్రి తుమ్మల ఆదేశం

వేగంగా విస్తరిస్తున్న ఖమ్మం నగర పాలక సంస్థలో పర్యవేక్షణకు కావాల్సిన అధికారులను నియామకం చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేఎంసీ మేయర్ పునకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్యకు నెల రోజుల క్రితమే స్వయంగా ఆదేశాలిచ్చారు. ఈ మేరకు పరిపాలన పరంగా నిర్ణయాన్ని తీసుకున్నారు. అత్యవసరంగా అసిస్టెంట్ కమిషనర్-1, డిప్యూటీ కమిషనర్‌లు-2ను తీసుకోవాలని నిర్ణయించారు. కాని ఫైల్ ముందుకు మాత్రం కదలలేదని తెలుస్తోంది.

నగర పాలక సంస్థలో ఉండాల్సిన ఉద్యోగులు ఇలా..

ఖమ్మం నగర పాలక సంస్థ హోదా మేరకు 237 మంది అధికారులు, ఉద్యోగులు బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ కేవలం 80 మంది మాత్రమే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంకా కేఎంసీకి 159 మంది అధికారులు, ఉద్యోగులను ప్రభుత్వం నియామకం చేయాల్సి ఉంటుంది.

కేఎంసీ క్యాడర్ స్ట్రంత్‌లో కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్-1, డిప్యూటీ కమిషనర్-2, సెక్రటరీ-1, పబ్లిక్ రిలేసన్ ఆఫీసర్-1, ఎడ్యూకేషన్ ఆఫీసర్-1, సూపరింటెండెంట్లు-9, పర్యవేక్షకులు-7, సినియర్ అసిస్టెంట్లు-18, జూనియర్ అసిస్టెంట్లు-18, సీనియర్ స్టెనోగ్రాఫర్లు-5, సిస్టమ్ మెనేజరు 1, సిస్టమ్ అసిస్టెంట్లు -2, రెవెన్యూ ఆఫీసర్లు 4, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు 6, బిల్ కలెక్టర్లు -26, ఎగ్జామ్‌నర్- 1, శానిటరి ఇన్స్‌పెక్టర్లు -7, జూనియర్ ఎకౌంట్స్ ఆఫీసర్లు -1, సీనియర్ ఎకౌంట్స్ ఆఫీసర్లు -4, జూనియర్ ఎకౌంటెంట్లు -6, ఛీప్ మెడికల్ ఆఫీసర్ -1, సహాయ మెడికల్ ఆఫీసర్ -1, శానిటరి సూపర్‌వైజర్- 2, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు -10, హెల్త్ అసిస్టెంట్లు -4, శానిటరీ జవాన్లు -30, సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ -1, సహాయకులు- 1, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్- 1, డిప్యూటీ ఇంజనీర్- 1, హర్టీకల్చర్ ఆఫీసర్ -1, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లు -13, డ్రాగ్‌మ్యాన్లు--2, సీఏడీ ఆపరేటర్లు- 1, సిటీప్లానర్- 1, డిప్యూటీ సిటీ ప్లానర్- 1, అసిస్టెంట్ సిటీ ప్లానర్స్ -4, ట్రాన్స్‌పోర్టు ప్లానర్- 1, టౌన్ ప్లానింగ్ పర్యవేక్షకులు 7, బిల్డింగ్ సర్వేయర్లు 10, ట్రేసర్‌లు- 2, వర్క్ ఇన్స్‌పెక్టర్లు- 8, జీఐఎప్ ఆపరేటర్లు- 2, పట్టణ సర్వేయర్లు -2 మంది నిబంధనల మేరకు కేఎంసీకి కేటాయించాల్సి ఉంది.

వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలి

» ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కూనంనేని, కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెం, సెప్టెంబరు16: సాగులో మెలుకువలు, నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకుని ఆర్థికాభివృద్ధి సాధించేందుకు వ్యవసాయ వైజ్ఞానిక ప్రదర్శనలు రైతాంగానికి దోహదపడతాయని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, డీఆర్డీఏ ఆధ్వర్యంలో ప్రకాశం స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న జిల్లా స్థాయి వ్యవసాయ వైజ్ఞానిక ప్రదర్శనను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌తో కలిసి స్టాల్స్‌ను తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ అందుబాటులో ఉన్న నీటి వనరులను, వ్యవసాయ భూమిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని తద్వారా అధికోత్పత్తి సాధించడంపై ప్రదర్శనలతో అవగాహన కలుగుతుందని తెలిపారు. వ్యవసాయశాఖ, ఉద్యానవనశాఖాధికారులు, సిబ్బంది కేవలం వైజ్ఞానిక ప్రదర్శనలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన కలిగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రోహిత్ రాజ్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ ఎగ్జిబిషన్‌తో రైతులకు ఎంతో ప్రయోజనం: కలెక్టర్ పాటిల్

కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా రెండు రోజుల పాటు రైతుల కోసం ఏర్పాటు చేసిన అగ్రికల్చర్ ఎగ్జిబిషన్ ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. సోమవారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి కలెక్టర్ ప్రకాశం స్టేడియంలో ఏర్పాటు చేసిన అగ్రికల్చర్ స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్ మాట్లాడుతూ ఎకరం, రెండు, మూడు ఎకరాలతోపాటు ఒక సెంటు భూమి ఉన్న రైతులు సైతం లక్ష రూపాయల వరకు ఆదాయం పొందడం ఎలా అనేది ఈ ఎగ్జిబిషన్ ద్వారా అవగాహన కల్పిస్తారని తెలిపారు. అగ్రికల్చర్, హార్టికల్చర్, డీఆర్డీఏ శాఖల ద్వారా ఏర్పాటు చేసిన స్టాల్స్ ఎంతో ఆకర్షణగా నిలిచాయని పేర్కొన్నారు. రైతులు ఎన్ని పనులు ఉన్న ఈ ఎగ్జిబిషన్‌ను తిలకించి అవగాహన పొందాలని సూచించారు. అగ్రికల్చర్, హార్టికల్చర్, డీఆర్డీఏ శాఖల ద్వారా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎంతో ఆకర్షణగా నిలిచాయని, అధికారులు సైతం అన్ని అంశాలను రైతులకు కూలంకుశంగా వివరిస్తున్నారని అన్నారు. వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధిలోకి తేవడమే లక్ష్యంగా జిల్లాలో సరికొత్త విధానాలను ప్రవేశపెడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. హైదరాబాద్, జిల్లా వంటి మహా నాగరాల్లో ఈ స్టాల్స్ ఇంతకు ముందు ఏర్పాటు చేసే వారని, జిల్లా రైతుల కోసం తొలిసారి అగ్రికల్చర్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే అగ్రికల్చర్ ఎగ్జిబిషన్‌కు రైతులు హాజరై పూర్తి అంశాలపై అవగాహన పొంది వ్యవసాయంలో నూతన పద్ధతులను అవలంబించాలని తెలిపారు. రైతులు తక్కువ ఆదాయంతో పంటలను సాగు చేసి, ఎక్కువ ఆదాయం పొందే విధానాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రోహిత్ రాజ్, వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు, రైతులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

తగ్గుతున్న గోదావరి నీటిమట్టం

భద్రాచలం, సెప్టెంబరు 16: భద్రాచలం వద్ద గోదావరి క్రమేపి తగ్గుతోంది. సోమవారం సాయంత్రానికి 25.3 అడుగులకు చేరుకుంది. ఆదివారం రాత్రి 10 గంటలకు 33.3 అడుగులున్న గోదావరి సోమవారం ఉదయం 6 గంటలకు 29.9 అడుగులకు, 10 గంటలకు 28.2, మధ్యాహ్నం 2 గంటలకు 26.7, సాయంత్రం 6 గంటలకు 25.3 అడుగులకు తగ్గింది. మంగళవారం గోదావరి మరింత తగ్గనుంది.

రామాలయాన్ని దర్శించుకున్న కలెక్టర్ దంపతులు



పూజల్లో పాల్గొన్న కలెక్టర్ దంపతులు

భద్రాచలం, సెప్టెంబరు 16: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో దేవస్థానం అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

భద్రాద్రికి తరలుతున్న గణనాథులు

- స్వామి వారి దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్ల ఏర్పాటు
- విధులు నిర్వహిస్తున్న 250 మంది పోలీస్ సిబ్బంది
- భక్తులకు అందించేందుకు సిద్ధమైన 50వేల లడ్డులు



గణనాథుల నిమజ్జన దృశ్యాలు

భద్రాచలం, సెప్టెంబరు 16: భద్రాచలంలోని పవిత్ర గోదావరి నదిలో సోమవారం గణేష్ నిమజ్జనాలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా విగ్రహాలు వివిధ ప్రాంతాల నుంచి కోలాహలంగా తరలివస్తున్నాయి. మోరియారే బప్పా మోరియారే.. గణపతి బప్పా మోరియా....జై గణేష్ జై జై గణేష్ అంటూ భక్తుల నామస్మరణల మధ్య ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలం పులకరించింది. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఎటు చూసినా గణేష్ రాష్ట్రంలోని ఖమ్మం, నల్గొండ, కరీంనగర్, వరంగల్ తదితర ఉమ్మడి జిల్లాల నుంచి గణనాథుల విగ్రహాలు భద్రాద్రి గోదావరిలో నిమజ్జనానికి తరలివస్తున్నాయి.

నిరంతరం కొనసాగుతున్న నిమజ్జనాలు

రాష్ట్ర వ్యాప్తంగా తరలివస్తున్న వేలాది విగ్రహాలను గోదావరి నదిలో నిమజ్జనం చేసేందుకు నాలుగు లాంచీలు, ఆరు క్రేన్ల సహాయంతో 24 గంటలు షిఫ్టుల వారీగా పని చేసే విధంగా సిబ్బందిని అధికారులు నియమించారు. భక్తులు స్నానాలు చేసే ప్రాంతాల్లో గజ ఈతగాళ్లను నియమించడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా తరలివస్తున్న భక్తుల రద్దీ దృష్ట్యా మంగళవారం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ దర్శన వేళల్లో మార్పులు చేశారు. తెల్లవారుజామున నాలుగు గంటలకే ఆలయాన్ని తెరిచి 4.30 నుంచి రాత్రి 10 గంటల వరకు భక్తులకు దర్శన సౌకర్యం ఏర్పాటు చేశారు. అలాగే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో పాటు, 50 వేల లడ్డూలను సిద్ధం చేసి భక్తుల రద్దీకి అనుగుణంగా ఆ సంఖ్యను పెంచనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌కుమార్ శంక్వార్, ఆర్డీవో దామోదర్‌రావు, తహసీల్దారు శ్రీనివాసరావు, నీటిపారుదల శాఖ ఈఈ రాంప్రసాద్, భద్రాద్రి దేవస్థానం ఈఈ వి.రవీంద్రనాథ్‌ల పర్యవేక్షణలో అధికార యంత్రాంగం నిమజ్జన ఏర్పాట్లను 24 గంటల పాటు పర్యవేక్షించే విధంగా సిబ్బందిని నియమించారు. అలాగే 250 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఆరుగురు సీఐలు, 10 మంది ఎస్సైలతో పాటు 250 మంది సిబ్బంది విధుల్లో పాల్గొంటారు. ఇదిలా ఉండగా విధి నిర్వహణలో పాల్గొంటున్న వివిధ శాఖల అధికారులకు పాకాల దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో నిరంతరం ఉచిత కాఫీ, టీ అందిస్తున్నారు. నేడు ఇల్లెందు, కొత్తగూడెంలలో గణేష్ నిమజ్జనాలను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి: కలెక్టర్

భద్రాచలంలో గణేష్ నిమజ్జన ఘాట్‌లో నిమజ్జనం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ వీక్షించారు. గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



గణేష్ నిమజ్జనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

చర్ల గోదావరి తీరంలో కలప నిల్వలు

» గుర్తించిన స్థానికులు » అధికారులకు ఫిర్యాదు

చర్ల, సెప్టెంబరు 16: మండలంలోని సీ కత్తిగూడెం జమీపంలోని కొరెగడ్డ గోదావరి తీరంలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు దిమ్మెలను సోమవారం సీకత్తిగూడెం గ్రామస్థులు గుర్తించారు. తీరం వెంబడి పదుల సంఖ్యలో టేకు మొద్దులు ఉన్నాయని చర్ల అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు అక్కడికి చేరుకునే లోపే వాటిని తరలించారు. వాటిని కొంత మంది అక్రమార్కులు కోసి దాచి పెట్టారని గ్రామస్థులు చెబుతున్నారు. గోదావరి వరదల్లో కొట్టుకుని వస్తుండగా వీటిని సేకరించి ముక్కలు గా కోసి దాచి పెట్టారని కొంత మంది చెబుతుండగా, ఛత్తీస్‌గడ్ నుంచి కూడా కలప కొంత వరకు కలప తెచ్చి ఉంటారని మరి కొంత చెబుతున్నారు. కాగా చర్ల అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకునే లోపే మణుగూరు, సాంబాయిగూడెం చెందిన వ్యక్తులు వాటిని తరలించుకుని పోయారని తెలుస్తోంది. ఒక్కో టేకు మొద్దు సుమారు 10 నుంచి 15 అడుగుల పొడవు ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా 60 నుంచి 100 వరకు భారీ టేకు మణుగూరు ప్రాంతం తరలినట్లు తెలుస్తోంది. గత కొద్ది నెలల క్రితం చర్ల మండలం వద్ది పేట నుంచి లారీలో అక్రమంగా తరులు తున్న కలపను చర్ల సిబ్బంది పట్టుకున్న విషయం తెలిసిందే. ఆతరువాత ఇతర ప్రాంతాల్లో కూడా భారీగా కలపను పట్టుకున్నారు. ముఖ్యంగా చర్ల మండలం గన్నవరం కాలనీ నుంచి పట్టపగలే అక్రమ కలప రవాణా సాగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు చర్ల మండలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కేబుల్ దొంగతనాలను అరికట్టాలి

- టీబీజీకేఎస్ ఆరోపణ

మణుగూరు, సెప్టెంబరు16: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓసీ క్వారీల్లో కేబుల్ దొంగతనాలు వరుసగా జరుగుతున్న యాజమాన్యం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు చూస్తోందని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకట్ ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్వారీల్లో జరుగుతున్న వరుస దొంగతనాలు కంపెనీలకి ఆర్థిక నష్టాన్ని చవిచూపెడుతున్నాయని కార్మికుల్లో కూడా భయాందోనలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఏరియాలోని ఓసీ-2 క్వారీ ఆఫ్ లోడింగ్ వైపై కేబుల్ దొంగతనాలతో పాటు క్వారీలో నడిచే ఐసీసీ పంపులకు మూడు స్విచ్‌ల ద్వారా జరిగే పవర్ సప్లై హార్మోర్ కేబుల్ చాలా ఖరీదు ఉంటుందని, దానిని కూడా దొంగలు ఎత్తుకెళ్లిన విషయం కార్మికుల ద్వారా తెలిసిందన్నారు. ఈ దొంగతనాలకు పాల్పడేది ఇంటి దొంగలా లేక బయటి వారా అన్న విషయాలను యాజమాన్యమే తేల్చాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా యాజమన్యం స్పందించి తగిన చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
8
మంగళవారం 17 సెప్టెంబరు 2024

నాయీ బ్రాహ్మణ సంఘం మండల కమిటీ ఎన్నిక


శ్రీను, కృష్ణార్జున్‌రావు

జూలూరుపాడు, సెప్టెంబరు 16: వెంగన్నపాలెం ఏవీఆర్ ఫంక్షన్ హాల్లో సోమవారం నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కడియాల సత్యనారాయణ, మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుదురుపాక నిర్మల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయిబ్రాహ్మణ సంఘం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కడియాల శ్రీను, కార్యదర్శిగా పెద్దారపు కృష్ణార్జున్‌రావులను నియమించారు. గౌరవ అధ్యక్షుడిగా కడియాల ఆనందరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.నరేష్, ఉప అధ్యక్షుడిగా మార్కపురి రాంబాబు, సహాయ కార్యదర్శిగా కడియాల వెంకన్నను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కడియాల నాగేశ్వరరావు, దుర్గారావు, ప్రేమ్, రవికుమార్, హరికృష్ణ, శేషాద్రి, బుచ్చిబాబు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గంగ ఒడికి గణేషుడు

నెట్‌వర్క్: గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో సోమవారం గణనాధులకు ఘనంగా ఊరేగింపు నిర్వహించి వీడ్కోలు పలికారు. గ్రామాలలో ఊరేగింపు నిర్వహించిన అనంతరం విగ్రహాలను నిమజ్జనానికి భద్రాచలం తరలించారు. డప్పుచప్పులు, వాయిద్యాల నడుమ యువకులు, పెద్దలు నృత్యాలు చేస్తూ ఘనంగా వీడ్కోలు పలికారు. భక్తులు ఊరేగింపు రథాలకు ఘన స్వాగతం పలుకుతూ ప్రత్యేక పూజలు జరిపారు. వినాయక ఉరేగింపులో భాగంగా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక వాహనాలకు ఏర్పాటు చేసిన సెట్టింగులు పలువురుని ఆకట్టుకున్నాయి. నవరాత్రులలో భాగంగా మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


పాల్వంచ హిల్స్ కాలనీలో..


మణుగూరులో గణేషుడి ఊరేగింపు


మణుగూరులో శోభయాత్రలో పాల్గొన్న వ్యాపారస్తులు


కొత్తగూడెంలో కోనేరు చిన్ని అన్నదానం


పూజల్లో పాల్గొన్న కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్


దుమ్ముగూడెంలో గణేషుడి కల్యాణం


జూలూరుపాడులో శోభయాత్ర


పాల్వంచ చాకలిబజారు గణనాధుని శోభాయాత్ర


బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజరలో..


గుండాలలో


పాల్వంచలో..


ములకలపల్లిలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే జారే


పాల్వంచలో యువతుల నృత్యం


అశ్వారావుపేటలోని లక్ష్మిగణపతి ఆలయ గణేష్ లడ్డూ వేలం పాట


తిరుమలకుంటలో గణేష్ని ఊరేగింపు


గుండాలలో లడ్డు దక్కించుకున్న భక్తుడు


జూలూరుపాడులో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో..


చుంచుపల్లిలో డీఎస్పీ అన్నదానం..

ప్రజలు మెచ్చిన నాయకుడు ఏచూరి

● సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్


ఏచూరి చిత్ర పటానికి నివాళ్లు అర్పిస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

చుంచుపల్లి, సెప్టెంబరు 16: ప్రజలు మెచ్చిన నాయకుడు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం దేశం ఒక కమ్యూనిస్ట్ యోధుడని కోల్పోయిందని.. భారత ప్రజా ఉద్యమాలకి ఏచూరి మరణం తీరని లోటు అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజె .రమేష్ అన్నారు. సోమవారం చుంచుపల్లి మండలంలోని విద్యానగర్‌కాలనీ బైపాస్ రోడ్ నందు ఏచూరి సంతాప సభను నిర్వహించి మాట్లాడారు. తొలుత ఏచూరి చిత్ర పటానికి సీపీఎం సీనియర్ నాయకులు కె.హెచ్.ప్రసాద్ పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, పట్టణ కమిటీ సభ్యులు నందిపాటి రమేష్, నాయకులు ఎమ్మెస్ ప్రకాష్, కొత్తపల్లి రమేష్‌బాబు, గడల నరసింహారావు, సీపీఐ చుంచుపల్లి మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి, సిఐటీయు జిల్లా నాయకులు రూపేష్, సీనియర్ సిటిజన్ సంఘ సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ద్వారానే పథకాల అమలు చేయాలి

పాల్వంచ టౌన్, సెప్టెంబర్ 16: భవన నిర్మాణ కార్మికులందరికి సంక్షేమ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అమలుచేయాలని భవన నిర్మాణ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా జేఏసీ పిలుపులో భాగంగా నటరాజ్‌సెంటరులోని భవన నిర్మాణ అడ్డావద్ద సోమవారం సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు, ఇఫ్టూ నాయకులు కే. సారంగపాణి, ఆర్. ఉపేందర్, దొడ్డ రవికుమార్ (సీఐటీయూ) మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారానికై ఈ నెల 18న కలెక్టరేట్ వద్ద కార్యక్రమం, 23న ఛలో హైదారాబాద్ కార్యక్రమాన్ని జయప్రదంచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

17న విద్రోహదిన సదస్సు

దుమ్ముగూడెం సెప్టెంబరు 16: కొత్తగూడెంలో 17న నిర్వహించ తలపెట్టిన తెలంగాణా విద్రోహదిన సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి సాయన్న పిలుపునిచ్చారు. సోమవారం ఆడవిరామవరంలో కరపత్రాలను విడుదల చేశారు. భూమి కోసం, భుక్తి కోసం హిందీ, ముస్లింలు కలిసి నైజాం రజాకారులపై వీరోచిత పోరాటాలు చేసి అసువులు బాశారని తెలిపారు. వీరభద్రం, కన్నయ్య శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకి వినతి

దమ్మపేట, సెప్టెంబరు 16: నియోజకవర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాలకు చెందిన ప్రజలు గండుగులపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణను సోమవారం కలిసి పలువురు వినతిపత్రాలు అందజేసారు. ఎక్కువ ఆరోగ్య సమస్యలపై ఎమ్మెల్యేను కలసి తమకు సహాయం చేయాలని అభ్యర్థించారు. దీనిపై స్పందించిన ఆయన వచ్చిన వినతులపై స్పందించి అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. వర్షాలకు దెబ్బతిన్న రహదారులకు మర్మతులు చేపట్టాలని, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు.


వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జారే

కట్ట రక్షణకు చర్యలు చేపడతాం: ఐబీ డీఈ


కుంగిన చెరువు కట్టను పరిశీలిస్తున్న అధికారులు

అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 16: రాముడు చెరువు కట్ట రక్షణకు తక్షణమే చర్యలు చేపడతామని నీటి పారుదల శాఖ డీఈ క్రిష్ణశంకర్ తెలిపారు. మండలంలోని రాజాపురం గ్రామ సమీపంలోని రాముడు చెరువు కట్ట పలు ప్రాంతాల్లో కుంగి కిందకు జారింది. చెరువు కట్టను సోమవారం ఏఈ నరసింహారావుతో కలిసి డీఈ కట్టను పరిశీలించారు. ఇటీవల కురిచిన భారీ వర్షాల వల్ల కట్ట కుంగిందని, వెంటనే మరమ్మతులు చేపడతామని, రైతులు ఆందోళన చెందవద్దని అక్కడున్న రైతులకు డీఈ హామీ ఇచ్చారు.

అత్యాచారాలను నిరోధించడంలో ప్రభుత్వం విఫలం: ఐద్వా

జూలూరుపాడు, సెప్టెంబరు 16: మహిళలపై ఇటీవల కాలంలో దాడులు అత్యాచారాలు, అకృత్యాలు రోజురోజుకి పెరిగిపోతునప్పటికి వాటిని నిరోధించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి సందకూరి లక్ష్మీ ఆరోపించారు. ఆదివారం జూలూరుపాడులో ఐద్వా ముఖ్యకార్యకర్తల సమావేశం సుగుణ అధ్యక్షతన జరిగింది. ఆమె మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలకు పాల్పడిన వారికి ప్రభుత్వాలు వత్తాసు పలుకుతూ వారికి శిక్షలు పడకుండా కాపాడుతున్నారని అన్నారు. 19న భద్రాచలంలో జరిగే ఐద్వా జిల్లా మహసభను నిర్వహించడం జరుగుతుందని అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో నాయకులు తాటి ఇందిరా, కోడెం సరిత, తాటి పద్మ, లక్ష్మీ, వెంకటమ్మ, దమయంతి పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

జూలూరుపాడు, సెప్టెంబరు 16: జూలూరుపాడు మండల పాస్టర్స్ ఫెలో షిప్ ఆధ్వర్యంలో వరద బాధితులకు సోమవారం నిత్యవసరాలను అందజేశారు. ఖమ్మంలోని మున్నేరు పరివాహక ప్రాంత క్రైస్తవ సేవకులకు వరద బాధితులకు బియ్యంతో పాటు, నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా పాస్టర్స్ ఫెలో షిప్ మండల అధ్యక్షుడు కబీర్‌దాస్ మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో వరద బాధితులకు మరింత చేయూతనందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మహేష్ విక్టర్, శుభాకర్, నిరీక్షణ్ కుమార్, పిలిప్, తిమోతి, శ్రీకాంత్, అద్భుతకుమార్, తదితరులు పాల్గొన్నారు.

డెలివరి సమయంలోనే గ్యాస్ చెక్‌చేసుకోండి

లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబరు 16: గ్యాస్ వినియోగదారులు గ్యాస్ రిఫిల్ బుక్ చేసుకున్న వినియోగదారులు గ్యాస్ డోర్ డెలివరి సమయంలో తమ ఇంటి వద్దకు వచ్చే డెలివరిబాయ్‌కు మీ రిజిస్టర్ మొబైల్‌కు వచ్చే 4 అంకెల ఓటీపీని విధిగా తెలిపి గ్యాస్ సిలెండర్ తీసుకోవాలని, అదేవిధంగా సిలెండర్ డెలివరి సమయంలో గ్యాస్ లీక్ ఉందా.. లేదా అని చెక్‌చేసిన తర్వాతనే వినియోగదారులు గ్యాస్ డెలివరి తీసుకోవాలని సివిల్‌సప్లైస్ హెచ్‌పీ గ్యాస్ మేనేజరు దండ దయాకర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈకేవైసీ, సేఫ్టీ క్లినిక్ భద్రత తనిఖీలు కూడా తమ సిబ్బందితో తప్పని సరిగా చేయించుకోవాలని దీనికి ఎటువంటి రుసుం చెల్లించాల్సిన పని లేదని ఇది పూర్తిగా ఉచితమని తెలిపారు. వినియోగదారులు తమ డెలివరి బాయ్‌కి సహకరించి మీకు గ్యాస్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండ గ్యాస్ డెలివరిని పొందగలరని ఆయన కోరారు.

మూడో మహాసభలను విజయవంతం చేయండి

మణుగూరు, సెప్టెంబరు 16: ఈ నెల 22 23ల్లో కొత్తగూడెంలో జరిగే రాష్ట్ర ఆటో క్యాబ్ ప్రైవేటు మోటార్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ మూడో రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర నేత అయోధ్య సోమవారం మణుగూరులో ప్రచారం నిర్వహించారు. సభల విజయవంతం కోసం జీబు జాత మణుగూరుకు చేరుకున్న సందర్భంగా పట్టణంలోని పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో అయోధ్య మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి వెంకన్న, కంచర్ల జమలయ్య, దుర్గాల సుధాకర్, సోందె కుటుంబరావు, కొత్తపల్లి సీతారాములు, రాజబాబు, భిక్షం, రమేష్, తోట రమేష్, వంకరాములు, రేగల వెంకన్న, బద్రి శ్రీను, ఎండిపాషా నాగేశ్వరరావు, వేణు శంకర్, శ్రీకాకులం వీరమల్లు, లింగస్వామి, తదితరలు పాల్గొన్నారు.

కేవోసీ నుంచి బొగ్గు తరలించాలని ధర్నా

ఇల్లెందు టౌన్, సెప్టెంబరు 16: సింగరేణి ఇల్లెందు ఏరియా కోయగూడెం ఓసీ నుంచి ఇల్లెందు సీహెచ్‌పీకి బొగ్గు రవాణా కొనసాగించాలని డిమాండ్‌చేస్తూ ఐఎఫ్‌టీయూ రెండు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మోటారు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోడేటి నాగేశ్వరరావు, మోటారు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి. రాసుద్దీన్‌లు మాట్లాడుతూ గత మూడు నెలలుగా కేవోసీ నుంచి ఇల్లెందు సీహెచ్‌పీకి బొగ్గు రవాణా నిలిచిపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బొగ్గు రవాణాకు టెండర్లు వేసినప్పటికి అమలు కావడం లేదన్నారు. తక్షణమే బొగ్గురవాణా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సారంగపాణి, కొండపల్లి శ్రీనివాస్, నరాటి వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, అంజయ్య, ఎస్‌కే. నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్షౌర వృత్తిదారుల దినోత్సవం

జూలూరుపాడు, సెప్టెంబరు 16: క్షౌర వృత్తిదారుల దినోత్సవ వేడుకలను సోమవారం జూలూరుపాడులో మండల నాయిబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కడియాల సత్యనారాయణ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నాయిబ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలని సంక్షేమ పథకాల మంజూరులో ప్రాధాన్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా నాయకురాలు కుదురుపాక నిర్మల, నాయకులు ఎం.నాగరాజు, మణి, శ్రీను, నాగేశ్వరరావు, నరేష్‌పాల్గొన్నారు.

రోగులకు పాలు, పండ్లు పంపిణీ

పాల్వంచ టౌన్, సెప్టెంబర్ 16 : మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుని ముస్లీం మైనార్టీయువత ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, బెడ్స్ పంపిణీచేశారు. ఈ సందర్భంగా ముస్లీం మైనార్టీ యూత్ నాయకులు మజీద్ ఖురేషి మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో ముస్లీం సమాజం నడవాలని కోరారు. మీలాద్ ఉన్‌నబీ వేడుకల్లో భాగంగా తాము ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కలీం, గౌస్‌పాషా, మజహర్, అప్జల్, బాబా తదితరులు పాల్గొన్నారు.

లడ్డు ధర రూ. 1,67,116

● బులియన్ మార్కెట్‌లో రికార్డు స్థాయి పాట


లడ్డు ప్రసాదాన్ని స్వీకరిస్తున్న రమణ దంపతులు

మణుగూరు/బూర్గంపాడు, సెప్టెంబరు 16 : వినాయక చవితి సందర్భంగా మణుగూరు పట్టణంలోని బులియన్ మార్కెట్ ఏరియాలో నవరాత్రోత్సవాల ముగింపు సందర్భంగా గణపతి చేతిలో ఉన్న లడ్డు ప్రసాదాన్ని వేలం వేశారు. ఈ వేలం పాటలో మార్కెట్ ఏరియా సభ్యులంతా పాల్గొన్నారు. పోటాపోటీగా జరిగిన ఈ వేలం పాటలో హరిసాయి జ్యూయలరీ నిర్వాహకులు ఆబోతుల రమణ దంపతులు రూ.1,67,116 కు పాట పాడి గణపతి లడ్డును కైవసం చేసుకున్నారు. మణుగూరు బులియన్ మార్కెట్ అసోసియేషన్ కమిటీ సభ్యులు లడ్డు ప్రసాదాన్ని రమణ దంపతులకు అందించారు.

రూ.76వేలు పలికిన గణేష్ లడ్డు

బూర్గంపాడు: బూర్గంపాడు మండల పరిదిలోని అంజనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన శ్రీ వరసిద్ధి వినాయక మండపం వద్ద సోమవారం నిర్వహించిన వేలంపాటలో లడ్డు ధర రూ.76వేలు పలికింది. గ్రామానికి చెందిన తేజావత్ రాఘవరావు(పారెస్ట్ బీట్ ఆఫీసర్) లడ్డును రూ.76వేలకు దక్కించుకోగా ఆలయకమిటి సభ్యులు లడ్డును అందజేశారు. కార్యక్రమంలో వైఎఫ్‌సిహెచ్‌ఎస్ వ్యవస్థాపకులు జానకిరామ్, భూక్యా హరిలాల్ పాల్గొన్నారు.

నేడు కొత్తగూడెం, ఇల్లెందులో నిమజ్జన శోభయాత్ర

» ఏర్పాట్లు చేసిన ఉత్సవ కమిటీలు » పోలీసుల బందోబస్తు

కొత్తగూడెం సాంస్కృతికం/ఇల్లెందుటౌన్, సెప్టెంబరు 16: నవరాత్రమహోత్సవాల్లో ఘనంగా పూజలందుకున్న గణనాధులను మంగళవారం భద్రాచలంలోని గోదావరిలో నిమజ్జనం చేసేందుకు కొత్తగూడెంలోని భక్తజనం సిద్ధమయ్యారు. కొత్తగూడెం గణేష్ ఉత్సవకమిటి, విశ్వహిందుపరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిమజ్జన శోభయాత్రను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లుచేశారు. ముందుగా నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు అందుకున్న గణేష్‌టెంపుల్‌లోని గణనాధుల విగ్రహాలను సాయంత్రం 4గంటలకు ప్రకాశం మైదానంకు సాంప్రదాయ పద్ధతిలో తరలించి అక్కడ నిమజ్జన శోభయాత్ర పూజలు నిర్వహిస్తారు. కొత్తగూడెం మీదుగా నిమజ్జనానికి వెళ్లే వందలాది వినాయకులకు స్వాగతం పలికేందుకు గణపతి ఉత్సవకమిటి, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో సూపర్ బజార్‌సెంటర్‌లో స్వాగతవేదికను ఏర్పాటుచేశారు. .

గణపతి నిమజ్జన శోభయాత్రను విజయవంతం చేయండి...

మంగళవారం కొత్తగూడెంలో జరగనున్న గణపతిశోభయాత్రలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గణేష్‌ఉత్సవ కమిటి అధ్యక్షుడు కేవి. రంగా కిరణ్ భక్తజనానికి పిలుపునిచ్చారు. 35సంవత్సరాలుగా గణేష్ ఉత్సవకమిటి, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో స్వాగత వేదిక ఏర్పాట్లుచేస్తున్నట్లు తెలిపారు.


చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, పోలీస్ అధికారులు


కొత్తగూడెంలో పూజల్లో పాల్గొన్న ఉత్సవకమిటి సభ్యులు

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

ఇల్లెందు టౌన్: ఇల్లెందు పట్టణంలో ఏర్పాటు చేసిన గణేష్ నవరాత్రుల సందర్భంగా ముగింపు వేడుకల్లో భాగంగా గణేష్‌నిమజ్జనం వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇల్లెందు పట్టణంలో 24 వార్డులో మొత్తం 122 గణేష్‌విగ్రహాలను ఏర్పాటు చేసి నవరాత్రులను నిర్వహించారు. నిమజ్జనానికి తరలించేందుకు తగిన ఏర్పాట్లను గణేష్ మండల నిర్వాహకులు ఇప్పటికే పూర్తి చేసుకున్నారు. మంగళవారం ఇల్లెందు పట్టణంలో గణేష్ నిమజ్జన వేడుకలనునిర్వహించనున్నారు. ఇల్లెందు పట్టణ సమీపంలోని 1వ వార్డు సత్యనారాయణపురం సమీపంలో గల చింతలచెర్వులో నిమజ్జనానికి, మున్సిపాలిటి, సింగరేణి అధికారులు తగిన ఏర్పాట్లను గావించారు. ఏర్పాట్లను ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు దొడ్డా డానియల్, మడుగు సాంబమూర్తి, చిల్లా శ్రీనివాస్, బొల్ల సూర్యం తదితరులు పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు.

నిమజ్జనానికి భారీ బందోబస్తు

ఇల్లెందు పట్టణంలో నిర్వహించే గణేష్ నిమజ్జనానికి భారీ ఎత్తున పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇల్లెందు డీఎస్పీచంద్రభాను, సీఐ సత్యనారాయణల ఆధ్వర్యంలో పోలీస్ బలగాలను ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంతో పాతబస్టాండ్ సెంటరు ఆవరణలో స్వాగత వేదికను ఏర్పాటు చేశారు.